
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
17-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

బల్దియాలో ఔట్‌సోర్సింగ్ రాజ్యం 2



తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలి 2


## పట్టుదలతో ఏదైనా సాధ్యమే: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. హోంగార్డు సిద్ధిరాములు కుమార్తె నిమిత ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 992 మార్కులతో టాప్ ర్యాంక్ సాధించింది. దాంతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిమితను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. లక్ష్యంపై అంకితభావం ఉంటే విజయం వరిస్తుందని నిమిత నిరూపించిందన్నారు. నిమిత పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

## ఏసీబీకి చిక్కిన బిచ్కుంద ఎక్సైజ్ సీఐ



**అక్షరటుడే, కామారెడ్డి:** ఉమ్మడి జిల్లాలోని అవినీతి అధికారులపై ఏసీబీ దృష్టి సారించింది. వరుస దాడులతో అవినీతి అధికారుల గుండెల్లో పరుగులు పెట్టిస్తోంది. అయినా అధికారులు లంచాలు తీసుకోవడం మానుకోవడం లేదు. తాజాగా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఏసీబీకి చిక్కారు. అక్రమంగా నిర్వహిస్తున్న ఓ కల్లు దుకాణాన్ని ఎలాంటి ఆటంకం లేకుండా నడుపుకునేందుకు సీఐ రూ. 2 లక్షలు డిమాండ్ చేశారు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా శుక్రవారం సీఐ అద్దెకు ఉంటున్న ఇంట్లో బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే అతని ఇంట్లో సోదాలు నిర్వహించారు. సీఐ బ్యాగులో లెక్క చూపని రూ. 45,760 నగదును కలిగి ఉండడంతో.. వాటిని కూడా ఏసీబీ సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు.

## మొరం అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదు..



**అక్షరటుడే, ఆర్మూర్:** నియోజకవర్గంలో మొరం అక్రమ రవాణాను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. మాక్లూర్, నందిపేట్ మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆర్మూర్‌లో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాక్లూర్ మండలంలో మొరం అక్రమ తరలింపు సాగుతోందన్నారు. నందిపేట్ మండల కేంద్రంలో ఇటీవల మొరం అక్రమ రవాణా జరగగా స్థానిక అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో ప్రత్యేక పోలీసు విభాగం వచ్చి మొరం అక్రమ దందాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ అక్రమ రవాణాలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, గోదావరి నుంచి నల్ల మట్టి తరలింపుపై అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. ఎవరైనా సరే పర్మిషన్ ఉంటేనే మట్టి తరలింపు చేయాలని ఓవర్ లోడ్, అధిక వేగంతో వెళ్లే వాహనాలపై అధికారులు నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నందిపేట్ మండల అధ్యక్షుడు పటేల రాజు, కంఠం సర్పంచ్ సాయి, మాజీ ఎంపీటీసీ పెయింటర్ రాజు, లక్కంపల్లి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# పాలన గాడిన పడేనా!

■ తెయూకు కొత్త పాలకమండలి నియామకం ■ వివాదాలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం ■ తీరు మారుతుందని విద్యార్థుల్లో ఆశలు

**తెలంగాణ యూనివర్సిటీకి ప్రభుత్వం కొత్త పాలకమండలి (ఈసీ)ని నియమించింది. దీంతో విశ్వవిద్యాలయంలో ఇకనైనా పాలన గాడిన పడేనా అనే చర్చ జరుగుతోంది. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆది నుంచి అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉన్నతాధికారులు, అధ్యాపకుల తమ రాజకీయాలతో విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారనే విమర్శలున్నాయి. మరోవైపు వర్సిటీ వరుస వివాదాలు వెంటాడుతున్నాయి. కొత్త ఏర్పడిన ఈసీతోనైనా పాలన చక్కబడుతుందని విద్యార్థులు ఆశిస్తున్నారు.** - అక్షరటుడే, ఆర్మూర్

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో తెలంగాణ విశ్వవిద్యాయాలన్ని నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేశారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. అయితే చదువులు నేర్పాల్సిన యూనివర్సిటీ అక్రమాలకు నిలయంగా మారింది. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయం కొందరు తమ జేబులు నింపుకోవడానికి వనరుగా మారింది. గతంలో పనిచేసిన కొందరు అధికారులు భారీగా అక్రమ నియామకాలు చేపట్టిన విషయం తెలిసిందే.

### దిగజారిన ప్రతిష్ఠ

వర్సిటీ ప్రారంభంలో ఏర్పాటు చేసిన రూ.100 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల విత్ డ్రా వ్యవహారం, యూనివర్సిటీకి సంబంధించిన రూ.150 కోట్ల విలువ చేసే 50 ఎకరాల భూమిని కోల్పోవడం గతంలో తీవ్ర చర్చకు దారి తీశాయి. హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ అక్రమ నియామకాల కొనసాగింపు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలతో వార్తల్లోకెక్కి యూనివర్సిటీ ప్రతిష్ఠ మసకబారింది. గతంలో ఏకంగా యూనివర్సిటీ వీసీ ఏసీబీకి సంచలనంగా మారింది.

### విద్యార్థి సంఘాల ఆందోళన

వర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు, ఆడిట్ నివేదికల్లో పలు లోపాలు బయటపడటంతో విశ్వవిద్యాలయ పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి కొన్నేళ్లుగా కీలక స్థానంలో కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలుఉన్నాయి. ఎలాంటి చర్యలకు అవకాశం లేకుండా పైఅధికారులను మేనేజ్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

### నిధుల దుర్వినియోగం

యూనివర్సిటీలో యూజీసీ, రూసా నిధులతో చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి. 2023-24లో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో టెండర్ నిబంధనలు ఉల్లంఘించి 40 శాతం అధిక ధరలకు కొనుగోలు చేసినట్లు ఆడిట్‌లో తేలింది. వర్సిటీలో ఇటీవల నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అడ్మినిస్ట్రేషన్ భవనం, ఆడిటోరియం, బాలికల వసతిగృహం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లోనూ నాణ్యత పాటించడం లేదని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

### కొత్త పాలకమండలితో..

తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా ప్రొఫెసర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ సుధాకర్ గౌడ్, గౌతమి పీజీ కళాశాల డాక్టర్ కె.సంజీవ రావు, గిరిరాజ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దండు స్వామి, ఇందూర్ పీజీ కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ మదన్ మోహన్ దేవబక్తుని, కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ చెరుకూరి రాజనీకాంత్, అల్లె లావణ్య, మహమ్మద్ గాజి, డాక్టర్ ఎస్.జయంత్ ఈసీ సభ్యులుగా నియమితులయ్యారు. వీరందరికీ విద్యారంగంలో ఎంతో అనుభవం ఉంది. తాజాగా కొత్తపాలకమండలి ఏర్పాటైన విషయం తెలిసిందే. ఇప్పటికైనా వర్సిటీలో అవినీతి, అక్రమాలు అడ్డుకట్ట పడి పాలన గాడిన పడాలని విద్యార్థులు ఆకాంక్షిస్తున్నారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిరసన





**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని కలెక్టరేట్‌లో టీజీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగులకు 52 శాతం పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ ఆయుష్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యావనంది పురుషోత్తం మాట్లాడుతూ.. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఉద్యోగులు ఉమా ప్రసాద్, జయరాజ్, రమేష్, రాజేందర్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.



## ఘనంగా బిగాల గణేశ్‌గుప్తా జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 25వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చింతకాయల రాజుఆధ్వర్యంలో బిగాల జన్మదినాన్ని పురస్కరించుకొని కోటగల్లీలో ఉన్న కోటమైసమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, కృష్ణారెడ్డి, సతీష్, శ్రీకాంత్, రంజిత్, భానుష్ సాయి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి :కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, ఆర్మూర్ మండలాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలంలోని ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సిన మరమ్మతు పనులు తదితర వాటి గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. గతేడాది వేసవిలో ఏయే ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తిందో తెలుసుకున్నారు. ఈసారి ఎల్‌నినో ప్రభావంతో సరిపడా వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నందున, తాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని, చివరి ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాల్లోని నివాసాలకు సైతం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని, సకాలంలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎక్కడైనా మంచినీటి కోసం ప్రజలు నిరసనకు దిగితే, సంబంధిత ఎంపీడీవోలను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. చేతి పంపులు, బోరు బావులకు తక్షణమే ఫ్లషింగ్ చేయించాలని చెప్పారు. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఆటంకం కలిగేలా పైప్‌లైన్లను ధ్వంసం చేయడం, వాల్వ్ లకు నష్టం చేకూర్చే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని కలెక్టర్ చెప్పారు. ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్, మిషన్ భగీరథ ఈఈ రాకేష్ పాల్గొన్నారు.

## మన ఊరి భద్రతను బాధ్యతగా తీసుకోవాలి : సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే,నిజామాబాద్ క్రైం:** మన ఊరు..మన కాలనీల భద్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు అరైవ్ అలైవ్‌లో భాగంగా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వ్యవసాయాదరులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని సూచించారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడడాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూడాలని, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ప్రతి ఒక్కరు వారిని గమనిస్తూ ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. బైక్ నడిపేవాళ్లు ఎట్టి పరిస్థితుల్లో హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లవద్దని సీపీ సూచించారు. అతివేగం కారణంగా తమతో పాటు ఇతరుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వా రెడ్డి, మేయర్ కూరగాయల ఉమారాణి, ఇన్‌ఛార్జి ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సర్పంచ్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు చిన్న సాయిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు, యాంటీ నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ పూర్ణేశ్వర్, సైబర్ క్రైం ఆర్ఎస్సై రవి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ అమలు చేయాలని టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/భీమ్‌గల్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఈజేఏసీ రాష్ట్ర అడిషనల్ సెక్రెటరీ జనరల్ పులగం దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ లోపల పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ అనంతరం పదేళ్లుగా ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు అధ్యక్షతన, 206 పైగా భాగస్వామ్య సంఘాలతో టీజీఈజేఏసీ స్థాపించి, పలుమార్లు 69 పైగా డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేశామన్నారు. టీజీఈజేఏసీ జిల్లా ఛైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్, కమిటీ జిల్లా కో-కన్వీనర్ మోహన్ రెడ్డి, కో -ఛైర్మన్లు రమేష్, రమణ్ రెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సురేష్, పండరీ నాథ్, వైస్ ఛైర్మన్లు విజయ్ సింగ్, శేఖర్, అమృత్ కుమార్, ప్రశాంత్, మోహన్, ఫైనాన్స్ సెక్రెటరీ జాకీర్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## మహిళ సాధికారిక బిల్లుకు మద్దతుగా సంతకాల సేకరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** బీజేపీ యువమోర్చా ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు ఉదయ్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు తెలియజేస్తూ ఆర్మూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బీజేవైఎం జిల్లా సీనియర్ నాయకులు కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో మహిళలు ముందుంటున్నారని.. అలాగే చట్టసభల్లోనూ ముందుండాలనే ఉద్దేశంతో ఈ మహిళా బిల్లు ప్రవేశపెట్టినట్లు ఆయన అన్నారు. మహిళను రాష్ట్రపతిగా బీజేపీ ప్రభుత్వమే అవకాశం కల్పించిందని రాబోయే రోజుల్లో మహిళలు మరింతగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి భరత్, ఉపాధ్యక్షులు మనీష్, చరణ్ గౌడ్ కార్యదర్శి పవన్ శ్రీకాంత్, ధనుంజయ్ బీజేపీ ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం శంకర్ భవన్ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని శంకర్ భవన్ పాఠశాల లో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఉపాధ్యాయులు గోపి, మల్లేశం, రాములు, రాజయ్య, రమేశ్, మాధవి, శ్రీలక్ష్మి, శాంతాబాయి, రజిని, పావని తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కారుపై వేముల నిప్పులు



**అక్షరటుడే, భీమ్‌గల్:** రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నెరవేర్చాలని కోరితే, వారిపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కమ్మర్‌పల్లి కి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు శుక్రవారం ఆర్మూర్ కోర్టులో విచారణకు హాజరైన సందర్భంగా ఆయన వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గం లో 52 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, కేవలం 22 వేల మందికే వర్తింపజేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మిగిలిన 30వేల మంది రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించినందుకు రైతులపై కేసులు పెట్టడం అత్యంత బాధాకరమన్నారు. రెండేళ్లుగా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. తక్షణమే రైతులపై ఉన్న కేసులను ఎత్తివేసి, అర్హులైన వారందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.




ఆర్మూర్ బల్దియాలో పాలన అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ ఉన్నతాధికారులను, రెగ్యులర్ ఉద్యోగులను సవాల్ చేస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపాలిటీని శాసిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రసన్నం చేసుకుంటే గానీ మున్సిపల్ కార్యాలయంలో పనులు జరగడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

– అక్షరటుడే,ఆర్మూర్

# ఆర్మూర్ బల్దియాలో ఔట్‌సోర్సింగ్ రాజ్యం..

■ మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పాలన ■ తాత్కాలిక ఉద్యోగుల గుప్పిట్లో బల్దియా ■ ముఖ్యమైన సెక్షన్లలో పాగా వేసేందుకు పైరవీలు..

కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మంచి ఆదాయం ఉన్న సెక్షన్లలోకి వెళ్లడానికి ఇటీవల పైరవీలు మొదలుపెట్టారు. ఓ కౌన్సిలర్ సహకారంతో ఈ వ్యవహారం చక్కపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. తమకు అనుకూలమైన రెవెన్యూ సెక్షన్ లో పెట్టిస్తే కౌన్సిలర్‌గా ఎన్నికల్లో పెట్టిన డబ్బులను త్వరలోనే తిరిగి ఇస్తామని వారు హామీ ఇచ్చినట్లు సమాచారం. రెవెన్యూ సెక్షన్లలో కొన్నేళ్లుగా పాగా వేసిన వీరిపై గతంలో ఆరోపణలు రావడంతో ఇతర సెక్షన్లకు బదిలీ చేయగా.. మళ్లీ రెవెన్యూ సెక్షన్‌లోకి వచ్చేందుకు ఓ కౌన్సిలర్‌తో పావులు కదుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కౌన్సిలర్ల బాహాబాహి..

ఇటీవల పట్టణంలో ఏర్పాటుచేసిన ఓ ఫ్లెక్సీలో ఫొటో వివాదం ఇరువురు కౌన్సిలర్ ఒకరిపై ఒకరు దాడి చేసుకునే దాకా వెళ్లింది. ఈ తతంగమంతా మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాంబర్లో జగిగిందని సమాచారం. ఆర్మూర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజాప్రతినిధులను గెలిపిస్తే ఇలా మున్సిపల్ కార్యాలయంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం ఆర్మూర్ పట్టణంలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, అధికార పార్టీ పెద్దలు శ్రద్ధ వహించి మున్సిపల్ పాలనను గాడిలో పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఆర్మూర్‌లో ఉద్యోగ ఉపాధ్యాయుల నిరసన..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అంగన్వాడీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు కుంట శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 51శాతం ఫిట్ మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియకు వినతిపత్రం అందజేశారు. గోపాల్ గంగాధర్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి (రిటైర్డ్ ఎంప్లాయీస్), జలంధర్, తుమ్మల లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి, విశాల్, రాంరెడ్డి, భరత్, అశోక్, విక్రమ్, సాయికుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలని ఎస్సై అరాఫత్ అన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రోడ్ సేఫ్టీ అవేర్నెస్‌లో భాగంగా గోల్డెన్ అవర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు ట్రాఫిక్ నియమ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అమృతా రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ మోహన్ రెడ్డి, పోలీస్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## హీమోఫీలియా బాధితులు క్రమం తప్పకుండా వైద్యసేవలు పొందాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** హీమోఫీలియా బాధితులు క్రమం తప్పకుండా వైద్యసేవలు పొందాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ/ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. హీమోఫీలియాపై సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. తగిన చికిత్స ద్వారా సమస్యలను నివారించవచ్చని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ తిరుపతి రావు, డాక్టర్ కిషోర్ కుమార్, హీమోఫీలియా నోడల్ ఆఫీసర్ పవన్ పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశంలో పెరుగుతున్న లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా అంబేడ్కర్ చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా లవ్ జిహాద్ కుట్రలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేషా సంపర్క్ ప్రముఖ్ అల్జపూర్ అక్షయ్, కొంగి రవి, నిఖిల్, గంజాల ప్రేమ్, బోబిడే కరణ్, ప్రవీణ్, అభిలాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ కట్ట నర్సయ్య అందజేశారు. ఈ సందర్భంగా కట్ట నర్సయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మచ్చర్ల ప్రజలు ఎవరైనా అనారోగ్యరీత్యా ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం తమను సంప్రదిస్తే సీఎంఆర్ఎఫ్ ద్వారా వారికి సాయం అందజేస్తామన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారి పరిస్థితిని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎల్‌వోసీ ఇప్పించి వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు సంజీవ్, జగదీష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ తేజస్వి సూర్యపై చర్య తీసుకోవాలి



**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ వేల్పూర్ కాంగ్రెస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై సంజీవ్‌కు వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మేధావులను, అమరవీరులను, యావత్ సమాజాన్ని కించపరిచేలా బీజేపీ ఎంపీ మాట్లాడటం దుర్మార్గమన్నారు. గతంలో ప్రధాని మోదీ సైతం విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు ఎంపీలు అదే బాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. తేజస్వి సూర్య వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ గౌడ్, నాయకులు నరేందర్, రమణ, మల్లయ్య, ఇంద్ర గౌడ్, సతీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఇద్దరికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధించారు. మరో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.

## చేంగల్‌లో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం




**భీమ్‌గల్, అక్షరటుడే:** మండలంలోని చేంగల్ గ్రామంలో శుక్రవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న (మక్కల) కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరే నాగమణి స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనంతరావు, ఏఈవో స్నేహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సాపురం జీవన్, సర్పంచ్ ధూమాల మమత రాజు, ఉపసర్పంచ్ మోహన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ రవి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు నూతుల రమేష్, అడప రాజేశ్వర్, వసంత్, నర్సారెడ్డి, శోభన్ గౌడ్, శ్రీధర్, ఆనంద్ గౌడ్, లింబాద్రి, ప్రశాంత్ తదితరులతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అగ్నిమాపక శాఖ వారోత్సవాలు




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** జిల్లావ్యాప్తంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నందిపేట్, భీమ్‌గల్ తదితర ప్రాంతాల్లో శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అధికారులు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆస్పత్రుల్లో ప్రజలకు అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగితే రెస్క్యూ చేయాల్సిన విధానంపై ఫైర్ సిబ్బంది ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే పరికరాలను ఎలా ఉపయోగించాలనే అంశంపై ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొత్త పార్టీ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం తమ కొత్త పార్టీకి సంబంధించి ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 25 హైదరాబాద్ శివారులో జరిగే తెలంగాణ నూతన పార్టీపేరును కవిత అధికారికంగా విడుదల చేయనున్నారని జాగృతి అడహక్ కమిటీ సభ్యుడు అవంతి రావు తెలిపారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో ప్రజలు కార్యకర్తలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ నుంచి సుమారు 15 వేల మందితో ఈ కార్యక్రమానికి తరలి వెళ్లనున్నామన్నారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న కవిత కోసం 200 కార్లు 200 బస్సులు నిజామాబాద్ జిల్లా నుంచి బయలుదేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో రజాక్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, కృష్ణమోహన్, ప్రవీణ్, నరేష్ నాయక్, కరిపె రాజు, రాఘవేందర్ బర్ల నరేష్, శోభవతి, రేఖ, అంజలి, దాత్రిక రేఖ, కౌసల్య, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

